# నైరూప్య ప్రకంపనాలు

పలుగు పారలతో
పసిగట్టే కుక్కలతో
ఎందుకలా గాలిస్తారు?
లోలోపలకి ఇంకా తమని ఖననం చేసుకుంటూ
యోగ నిద్రలోకి జారిపోతున్న వారిని
ఎందుకలా బయట కీడుస్తారు?

ఇన్నాళ్లూ –
ప్రాణ వాయువుని నింపి పంపే
నా సర్వస్వాలు
నా చుట్టూ ఖండఖండాలై పడున్నాయి
ఆగిపోయిన ఆర్తనాదాలన్నీ
ఇంకా నాకు వినిపిస్తూనే ఉన్నాయి

తట్టుకున్న ప్రాణం తప్ప
తోలు బొమ్మల్లానో
తోపుడు బండిలానో
ఇప్పుడు నా శరీరం
ఉందో ఊడిందో తెలీని
విడి భాగాల సమ్మేళనం

ఎప్పుడో భూచర్మం మీద
బూడిదయి పోరాడే కంటే
ఉన్నదంతా నెత్తిన పెట్టుకుని
ఊరందరితో బాటు
భూగర్భంలోనే ఇలా ఇమిడి పోనివ్వండి

రేపటి చరిత్ర కారులకి
ఒకప్పటి నాగరికతకో - నాశనానికో నిదర్శనంగా
మా విరిగిన కుండలో
వికృతమైన పుర్రెలో
మిగల నివ్వండి
చూసీ చూడనట్టు నన్నలా వదిలేయండి!